

“ ఒ క సో ద రు డు ”

౧
ప రి చ య ము

బాల్యమునందె మోహనరావు తనతలిదండ్రులఁ గోల్పోయెను. నాఁటినుండియు నాతని మేనమామయగు మాధవరావుగారతనిని, తలిదండ్రులు లేనిలోపము లేకుండఁ బెంచుచుండిరి. ఈయనకు విజయవాడలో మూఁడు నాలుగువందల రూపాయల వేతనముగల యొక గొప్పయుద్యోగము గలదు. చిరకాలమునుండి విజయవాడయే నివాసస్థలమైనందునఁ, గృష్ణయొడ్డునఁ 'చంద్రభవన'మను పేరిట నొక సుందరమగుభవనమునుగట్టించి యుండుండిరి. ఆయన కొకపుత్రిక గలదు. ఆమెయే మనకథానాయకియగు జానకి! ఈమె మోహనునికన్న నాలుగేఁడులు చిన్న. లేక లేక కల్గిన యొక్కపుత్రికపైఁ దలిదండ్రులగు మాధవరావు, కామేశ్వరమ్మగార్లకుఁగల ప్రేమయింతయని వేఱుగ వర్ణించి వ్రాయు టనవసరము. మోహనరావునుగూడ వారు తమకన్నబిడ్డకన్న నెక్కుడుప్రేమాతిశయముతోఁ బెంచుచుండిరి. వారికిఁ బురుషసంతానము లేకపోవుటయు దీనికిఁ గారణము.

మాధవరావుగారియోగ్యత, మేధాశక్తి, మొదలగునవి, ఆయనకుఁ బ్రజలయందు బ్రఖ్యాతి గడించిపెట్టినవి. ఎల్లరకు నీయనయనిన నమితమగు భక్తి. తాను కలుగఁజేసికొన్న ప్రతివిషయమునందు నీయన యగ్రస్థానమువహించి ప్రజలగౌరవాదరణలకుఁ బాత్రుఁ డగుచుండెను. ఇఁకఁ గామేశ్వరమ్మగారిమార్గము వేఱు! ఈమెను జిన్ననాఁటినుండియుఁ బట్టుదలయనుపిశాచము బాధించుచుండెను. తాను పట్టినపట్టు మంచిదైనను, చెడ్డదైనను, విడువదు. దూరమాలోచించుస్వభావ మీమెయందు లేకపోవుటచే నీపట్టుదల తఱచు విషమావస్థగాఁ బరిణమించుచుండెడిది. ఈమెకుఁగలఛాందసము, దానికి మఱింత సాయపడుచుండెను.

తలిదండ్రులమఱపించు మాధవరావుగారి ప్రేమకుఁ గృతజ్ఞుఁడై, మోహనరావు మెలఁగుచుండెను. అతనిసహజసద్గుణసంపత్తియు, బుద్ధిసూక్ష్మతయు, చారుసౌందర్యవిగ్రహమును, మేనమామనేకాక యెల్లర నాకర్షించుచుండెను. జానకి గుణరూపములందు మోహనునకుఁ దీసిపోదు. ఆమె బాలికయైనను బుద్ధిసూక్ష్మతయందును, సుగుణసంపత్తియందును పెద్దదే! ఇంకను వికసింపని యామెయౌవనకుసుమ మప్పుడే సౌరభములు వెదజల్లుచుండెను. జానకీమోహనులొక్కచోఁ దినుచు, నొక్కచోఁ జదువుకొనుచు, ఒక్కచో నాడుకొనుచు, నిముసమాత్రమైన నొండొరుల నెడఁబాయక పరస్పరప్రేమారూఢులై మెలఁగుచుండిరి. వారిపరస్పరప్రేమాతిశయమునకు మాధవరావుగారెంతయు సంతసించుచుండిరి.

౨
మాధవరావుగారి మరణము

మోహనరావునకుఁ బదునాలుగేండ్లు నిండినవి. జానకికిఁ బదియవయేఁడు. మొదటినుండియు మాధవరావుగారికి, జానకీమోహనులకు వివాహము సేయవలయునని యాశ గలదు. అందులకే జానకీమోహనుల పరస్పర ప్రేమాతిశయమునకు సంతోషించెడివారు. తమకు మగపిల్లలు లేరు. మోహనునకుఁగల పిత్రార్జితము బహుస్వల్పము. మాధవరావుగారికి వలసినంతయాస్తి గలదు. తనకు జానకిదప్ప నితరులు లేరు. అందుచే మోహనునకుఁ బిత్రార్జిత మేమియు లేకపోయినను ఇబ్బంది లేదు. బుద్ధిమంతుఁడును, రూపవంతుఁడును, నగు అల్లుఁడే మాధవరావుగారికిఁ గావలయును. ఇవన్నియు మోహనునియందుఁ జక్కగ నమరినవి. వానికితోడుగ జానకీమోహనులలోఁ బరస్పరప్రణయము ప్రబలియున్నది. ఇంతకన్న మాధవరావుగారికిఁ గావలసిన దేమున్నది? ఆయన యీవిషయమై కామేశ్వరమ్మగారితోఁగూడ వీలయినప్పుడెల్ల మాట్లాడుచుండిరి. ఆమె తన అయిష్టమును జూపకుండినను తటస్థముగా నూరకొనుచుండెను. ఇందులకు గారణము లేకపోలేదు. ఈమె మిగులఁ బూర్వాచారపరాయణ. మోహనుఁడు నవీనాచార పరాయణుఁడు. బ్రహ్మసమాజమునం దెక్కుడభిమానముఁ జూపుచుండెడివాఁడు. హిందూ దురాచారములఁ గొన్నింటి నామె యెదుట సకారణముగ ఖండించుచుండెడివాఁడు. ఈమె నిజస్థితి గ్రహింపలేక యాగ్రహముఁ జెందుచుండెడిది. ఇది నిత్యము జరుగుచుండుటచేత నామెహృదయమున మోహనునిపై నసహ్యభావము నాటుకొనిపోయెను. మాధవరావుగారిట్టివిషయములందు నిర్లక్ష్యభావముఁ జూపెడివారు. జానకిగూడ నొక్కొక్కసారి మోహనునివైపు మాట్లాడి తల్లికిఁ గోపము దెప్పించుచుండెడిది. బుద్ధిపూర్వకముగ, గాదు; సరియైనకారణములు చెప్పి యామె నొప్పింపవలయునని జానకి ప్రయత్నము.

జానకి విద్యావతి. మోహనుఁ డామెను దన ప్రక్కకుఁ ద్రిప్పుకొని కామేశ్వరమ్మగారితో వాదించుచుండెడివాఁడు. ఈతనివలన జానకికూడఁ జెడిపోవుచున్నదని తల్లియూహ. అందుచే వారివివాహ మామె కంత యిష్టములేదు. కాని వారిద్దఱును మంచిమార్గమునఁ బడిన నిద్దఱకు వివాహము సేయవచ్చునని తలంచుచుండెను.

మాధవరావుగారు తమయుద్దేశ్యమును జానకీమోహనులకుఁ దెలియనీయలేదు. సమయమునఁ దెలియనీయవచ్చునని మిన్నకుండిరి. జానకి మాత్ర మెట్లో తలిదండ్రుల రహస్యసంభాషణ విని గ్రహించెను. అప్పు డామెపొందిన హృదయానందము వర్ణనాతీతము. తా నాసంగతి మోహనునకుఁ దెలియనీయలేదు. మోహనుఁ డాసంగతి నేమియు నెఱుఁగఁడు. తనకు జానకివంటి భార్య దొరకుట దుస్సాధ్యమని తలంచుచుండెను. ఆమెపైఁ దనకుఁగల యనురాగము మఱల్పఁ బ్రయత్నించెను గాని నిష్ఫలమయ్యెను. తనవంటివాఁడు జానకి నాసించుట పరిహాసాస్పదమని భావించుచుండెను. కాని యెట్లు? ప్రేమ మఱలదు. ఇట్టియాలోచనలతోఁ గాలము గడపుచుండెను.

మాధవరావుగారు తమకోర్కె నెరవేర్చుకొనుటకుఁ బ్రయత్నములు మొదలిడిరి. కాని తా నొకటి తలఁచిన దైవ మొకటి తలఁచును. జానకీమోహనుల దురదృష్టవశమున నాయన యకస్మాత్తుగా వ్యాధిగ్రస్తుఁడయ్యెను. వైద్యులకు లోటులేదు. ఔషధములకుఁ గొదువ లేదు. కాని రోగము నానాఁటికి దుర్భరమై మరణావస్థకు దింపెను. గృహమున నెవరికిని ధైర్యములేదు. వైద్యులు తమతమశక్తిసామర్థ్యముల నుపయోగించిరి. కాని కార్యము లేకపోయెను. మన మెన్ని ప్రయత్నములు చేసినను విధివ్రాఁత తప్పదుగదా! మాధవరావుగారి కవసానకాలము సమీపించెను. అప్పుడు భార్యనొక్కతెను బిలిచి తనలోనున్న బాధ నంతయుఁ బ్రయత్నముమీఁద నణఁచిపెట్టి యామెతో నిట్లనెను: "నాకిఁక భగవంతుని యాజ్ఞ యైనది. పోయివచ్చెదను. నీవుమాత్ర మధైర్యముఁ జెందక జానకీమోహనులను జాగ్రత్తగాఁ బెంచుము. సాధ్యమగునంతత్వరలో వారిరువురకు వివాహమొనర్చి యందఱును సుఖముగ నుండుఁడు. నా చేతులతో నేను వారిద్దఱకు వివాహము సేయవలయునని యత్నించితిని గాని నా కాయదృష్టము లేకపోయెను." భార్య మారాడలేక కంటనీరువెట్టుకొని యేడ్వఁదొడఁగెను. తరువాత జానకీమోహనులఁ బిలిచి తనప్రక్కఁ గూర్చుండఁబెట్టుకొని "అమ్మా, జానకీ! నాయనా, మోహనా! నేను పోయివచ్చెదను. ఇఁకముందు మీజీవితము లెట్లుండునో కదా! అన్నిటికిని అమ్మయున్నది. మీరుమాత్రము భద్రము. మీ వివాహము చూచుభాగ్యము నాకు లేదందుకు విచారించుచున్నాను." అనియెను. లోనుండి పొంగిపొరలివచ్చుచున్న దుఃఖము కన్నీటిగుండ బయటఁబడెను. జానకీ మోహనులు మాధవరావుగారిమీఁదఁ బడి కౌఁగిలించుకొని హోరున నేడ్వఁదొడఁగిరి. అందఱికును మనోధైర్యము వాడెను. ఇఁక వారికి ధైర్యము చెప్పువా రెవరు? మాధవరావుగారిని బాధించుచుండిన రోగ మొక్కపెట్టున భయంకరమృత్యురూపము దాల్చి ఆమహానుభావుని నోటఁబెట్టుకొని పోయెను.

3

జానకి - మోహనరావు

మూఁడేండ్లు గడచినవి. కామేశ్వరమ్మగారు జానకీమోహనులను బెంచుచుండిరి. మోహనరావు కాలేజీచదువునకై రాజమహేంద్రవర మేఁగెను. కృష్ణయొడ్డున వారి చంద్రభవనమునందే జానకి, కామేశ్వరమ్మగారు నివసించుచుండిరి. మోహనరావు సెలవులకు వచ్చుచుండెను. అతఁడు రాజమహేంద్రవరములో నున్నన్నినాళ్లును జానకి కేమియుఁ దోఁచుటలేదు. ఇంతవఱ కొకరినొకరు వదలియుండనివారి కిప్పు డెడఁబాటు గల్గినఁ గష్టమే కదా! కాని తప్పదు. వారిద్దఱు నెట్లో దినములు గడపుచు వచ్చిరి. సెలవులనిన వారికి పండుగ. ఎప్పుడు సెలవుదినములు వచ్చునా, ఎప్పుడు విజయవాడకుఁ బోవుదునా, యని మోహను డాలోచించుచుండును. ఎప్పుడు మోహనుఁ డింటికివచ్చునా యని జానకి తపించుచుండును.

క్రిస్టమస్ సెలవులు వచ్చినవి. మోహనరా వింటికి వచ్చెను. ఇఁక జానకీమోహనులకుఁ బండుగే! వారొండొరులఁగాంచి సంభాషించుకొను నప్పుడు శశాంకునిఁజూచి జలధి యుప్పొంగునట్లు వారి హృదయము లానందముచే నుప్పొంగును. వీరి ప్రవర్తనము కామేశ్వరమ్మగారి కంతఁగా నిష్టములేదు. మోహనుఁడు బ్రహ్మసమాజమునం దభిమానియగుటయే యిందుకుఁ గారణము. బ్రహ్మసమాజమనిన జంకెములఁ ద్రెంపి వితంతువివాహములఁ జేసికొనుటయనియే కామేశ్వరమ్మగారి నమ్మకము. కాని సమాజముయొక్క నిజము మోహనుఁ డెన్నిమార్లు బోధించినను ఆమె తలకెక్కినది కాదు. మోహనుఁడే తన తనయను దుర్మార్గమునఁ బెట్టుచున్నాఁడని యామెయొక్క నమ్మకము. ఈసంగతి జానకి గ్రహింపలేకపోలేదు. చాలసార్లు చెప్పిచూచెను. కాని, యత్నము నిష్ఫలమయ్యెను. ఏమిసేయఁ గలదు?

నాఁటిసాయంకాలము చంద్రభవనోద్యానవనము వివిధ తరులతాపుష్పాదులతో, సంధ్యారాగపుటీరెండలో నూత్నశోభఁ గాంచుచుండెను. పుష్పసుగంధవాహినులై చిరుగాలులు మెల్లన నాకుల నాడించుచు హృదయాహ్లాదకరముగ నుండెను. అస లుద్యానవనమే మనమున కాహ్లాదకరము! ఆ వివిధవర్ణపుష్పలతాదులే మనోరంజకములు! ఆ పుష్పసుగంధములే ఆనందదాయకములు! వీనికిఁదోడుగ సంధ్యారాగము, కృష్ణవేణీ ప్రవాహము, ఆ తరంగమాలికలగానము! ఇఁకఁ గావలసిన దేమున్నది? అప్పుడుండు ఆనందము, సౌఖ్యము అనుభవైకవేద్యములు! ఇట్టి యానందము ననుభవించుటకే జానకీమోహనులు విహారార్థము బయలుదేరిరి. వారివిమలసౌందర్య కాంతులచే నాయుద్యానవనము, ఆ సంధ్యారాగము, ఆ కృష్ణవేణీతరంగిణి, ఆస్నిగ్ధసైకతస్థలములు, మఱింత శోభఁగాంచినవి. వానికి ఆజానకీ మోహనులే తగుదురు.

ఆ యుద్యానవనము కృష్ణయొడ్డుననే యుండుటచే దానికిఁజేరి యొక యిసుకతిన్నె గలదు. జానకీమోహను లటకేగి కూర్చుండిరి. ఒకవైపునఁ గృష్ణవేణి! ఒకవైపున నుద్యానవనము! చంద్రభవనము! పైని సంధ్యారాగము! మధ్యమధ్య ఘుమఘుమాగమము! ఇఁక నేమి కావలయును?

"మోహనా, ఈ ప్రకృతిసౌందర్యము నా భావతరంగముల నుప్పొంగఁజేయుచున్నది సుమా! ఈకృష్ణవేణి, ఈ యుద్యానవనము, ఈ సంధ్యారాగము, మనమున కెంతయానందమును గూర్చుచున్నవో కాంచితివా?" అని జానకి తన మోమునఁ జిఱునగవుతో మృదుమధురస్వరమున ననెను.

మోహనుఁడు మందహాసముతో, "జానకీ! నీవు చెప్పినది నిజమే కాని, నీవు పరిహాసముగాఁ దలంపకున్నచో నే నొకసంగతిఁ జెప్పెదను. నీ విటనుండుటవలననే నే నీయానందమును బొందుచున్నాను. నీవు లేనియెడల నన్నీప్రకృతి సౌందర్యము లెవ్వియు నాకర్షింపలేవు. నీవు నమ్మినను, నమ్మకపోయినను, నా హృదయాంతరాళమున నుండి వెలువడిన భావమిది" అనెను.

"మోహనా, ఇట్టిపరిహాసము లెడ నేర్చికొంటివి!"

"నామాట పరిహాసమా? నా యంతరాత్మసాక్షిగఁ జెప్పుచున్నాను."

"పరిహాసము గానిచో నాదర్శనమాత్రమున నీకుఁ గలుగు నానందమునకుఁ గారణ మేమి?"

"అది నే నెట్లూహింపనేర్తును! నీపై నాకుఁగల నిర్మల ప్రేమయే కారణమని తలంతును."

జానకిమోమునఁ గొంచెము కోపముగనుపడుచుండ "ఏమీ! కన్యకను, అస్వతంత్రను, నన్నీవిధముగఁ బ్రేమింపవచ్చునా? ఇదియన్యాయముగాదా!" అనెను.

"జానకీ, క్షమింపుము. పొంగిపొరలు నామనోభావము నాఁపుకొనలేక యట్లంటిని. నాహృదయము నాస్వాధీనమైయుండినచో నిన్నుఁ బ్రేమింపకపోయియేయుందును. ఈ దరిద్రుఁడు జానకిని బ్రేమించుట కర్హుఁడని, నేనిదివఱకే యెఱుంగుదును; కాని, మనస్సు స్వాధీనము కాకుండుటచేఁ బ్రేమ మరల్పలేకుంటిని."

జానకి, "మోహనా!" అని యాతనికంఠమును గౌఁగిలించుకొనెను. వారిరువురి మేను లేకమై పరవశతఁ గాంచెను. నేత్రములనుండి యానందబాష్పములు వెల్లువలై ప్రవహించెను. క్షణకాలము వారిరువురు మైమఱచిరి.

కొంతసేపటికిఁ గౌఁగిలివీడి, జానకి "మోహనా, నన్ను నీ వెట్లు ప్రేమింపుమంటివో నిన్నును, నే నట్లే ప్రేమించుచున్నాను. ఇది ముమ్మాటికిని సత్యమని నమ్ముము. జానకికి నీవే సర్వమును; నీదివ్యదర్శనమే నేత్రానందము; నీవాక్సుధారసమే కర్ణానందము; నీ కౌఁగిలియే మోక్షము. నీకుఁదప్ప జానకిహృదయమున, నన్యునకుఁ దావులేదు" అనెను.

"మనపరస్పరప్రేమకు అత్త యవరోధము గల్పించునేమోయని భయమగుచున్నది"

"అంగీకరించినను, అంగీకరింపకున్నను, మనహృదయభావములకు మార్పులేదు. అమ్మ కీవిషయమున నేమియు సంబంధము లేదు."

౪

అవరోధము.

"మోహనా, నీహృదయము మార్చికొని, బాగుపడఁ దలఁచుకొనలేదా?" అనికామేశ్వరమ్మగారు మోహనునిఁ గఠినముగా నడిగెను.

"అత్తా! నాహృదయమున నాటుకొని, పెరిగి, పెద్దదైనమహావృక్షమును పెఱికివైచుటెట్లు? నాయంతరాత్మ నిక్కమని నొక్కిచెప్పునది కాదనుట యెట్లు?"

"నీ విన్నిగాక మఱెన్ని చెప్పినను, నామనమున కెక్కదు. నీవు నిజముగాఁ బాడైపోవుచున్నావు."

"అత్తా, నీమూఢనమ్మకమే నీదిగాని, నేఁజెప్పువిషయము లెన్నఁడును నీ వించుకంత విమర్శించి యాలోచింపవు. ఇఁక నామాటలు నీమనమున కెట్లునచ్చును?"

"నీ కంతయభిమానమున్న నాసమాజమున నేఁ జేఱరాదా? జందెము త్రెంపివైచి, యొకవితంతువును వివాహమాడరాదా?"

"జందెముఁ ద్రెంపి, వితంతువును వివాహమాడుటే బ్రహ్మసమాజమని నీనమ్మకము. నిజమును నీకెన్నిమార్లు చెప్పినను బోధపడకున్నది. నే నీరోజునఁగాకున్న రేపైనను బ్రహ్మమతమును దప్పక స్వీకరింతును."

కామేశ్వరమ్మగారు కోపముతో, "మోహనా, చిరకాలమునుండి నీకు జానకినిచ్చి వివాహము సేయవలయునని యనుకొనుచుంటిని. నీ వెన్నఁటికిని బాగుపడునట్లు తోఁపదు. కావున జానకి నింకొకని కిచ్చి పెండ్లిచేసెదను." అనెను.

మోహనుని మోము వెలవెలఁబోయెను. ఈతుదివాక్యమాతనిహృదయమున దారుణాఘాతమై బాధించెను. ఈమనోవేదన భరియించు టెట్లు? కాని, ప్రయత్నముమీఁద దాని నణఁచిపెట్టెను. "అంతమాత్రమున నేను నాహృదయమును మార్చుకొందునా? నాయదృష్టమెట్లుండిన నట్లగును." అనెను.

కామేశ్వరమ్మగారికి కోపము హెచ్చెను. పండ్లు పటపటఁ గొరుకుచు, "సరె, జానకి నీకుఁదక్కదు. గుంటూరులో నొకసంబంధమున్నది. ఆవరునకు జానకినిచ్చెదను. నీవు బ్రహ్మసమాజము స్వీకరింపు" మనెను.

మోహనరా వట్లె తానుగూర్చుండిన కుర్చీలో నిస్తబ్ధుఁడై యుండెను. ఏమిసేయుటకుఁ దోఁపదు. హృదయమునకు భయంకరమగు కత్తిపోటు! కర్తవ్యాంతర మేమి?

కామేశ్వరమ్మగారు గదినుండి వెడలిపోయెను. ప్రక్కగదిలో నుండి వినుచున్న జానకి యొక్కుమ్మడిగ వచ్చి మోహనునిఁ గౌఁగిలించుకొనెను. ఈకౌఁగిలింత, నిన్నటి యిసుకతిన్నెపైఁ గౌఁగిలింతవంటిదికాదు. అది ఆనందాతిశయమువలన, ఇది పట్టరాని దుఃఖాతిశయమువలన! అప్పుడు వెడలిన కన్నీరాహ్లాదమువలన, ఇప్పుడు వెడలిన కన్నీరు దుస్సహవిచారమువలన! ఇఁక నేమున్నది? నిర్మలప్రణయప్రవాహమునకుఁ దీరని యవరోధము!

౫

వి వా హ ము

మోహనరావునకు సెలవులు గతించెను. అతఁడు రాజమహేంద్రవరము విడచెను. వెళ్లిన నేమిప్రయోజనము? మన స్సిక్కడనే యున్నది. అతనిని చిరకాలమునుండి బంధించుచుండిన ఆశాపాశము తెగిపోయినది. మాతృసమానయై తన్నుఁ బెంచుచున్న మేనత్తచేఁ దిరస్కరింపఁబడిన మోహనునిస్వాంత మెటులుండునో వేఱుగ వర్ణింప నవసరము లేదు. కాని జానకి తన్ను గాఢముగఁ బ్రేమించుచున్నదనిమాత్ర మాతనికిఁ గొంచెము ధైర్యముగ నుండెను. ప్రేమించుచున్నంతమాత్రమున మేనత్త జానకిని దన్నుఁ బెండ్లాడనిచ్చునా? ఆమెకుమోహనరావుమీఁద గోపమునకుఁగారణ మాతఁడు బ్రహ్మసామాజికుఁడ నయ్యెద ననుటయే. ఇట్లు బ్రాహ్మణ్యము చెడఁగొట్టునాతనికి దనతనయనిచ్చుట యామెకేమాత్రము నిష్టముగ లేదు. మోహనరావు తాను బ్రహ్మసామాజికుఁ డగుట మానెదనన్న నామె మెత్తఁబడునేమో! కాని యాతఁ డసత్యము పల్కుటకు సాహసింపఁడు. ఈసందర్భమున జానకిహృదయ మెట్లుండెనో వ్రాయనక్కఱలేదు. ఎట్లైన మోహనునిచే నబద్ధమాడించి యతనిని సామాజికుఁడగుట మానెద ననిపించుట కామె విశ్వప్రయత్నము చేసెను. కాని మోహనుఁ డందులకు సమ్మతింపఁడయ్యె! తల్లికిఁగూడ నామెచాల దూరము బోధించిచూచెను. కార్యము లేకపోయెను. తన కిఁక నన్యునిఁ జేపట్టవలయునని నిర్బంధము వచ్చెను. ఇదివఱకే తన హృదయమును మోహనుని యధీనముచేసినజానకి ఇప్పుడెట్లన్యునిఁ జేపట్టఁగలదు? పాప మామెకు గత్యంతరము లేదు.

జానకి ధీమతి. గభీరహృదయ. తాను మోహనునిఁ దక్క నితరునిఁ బ్రేమించుటకల్ల. తల్లి తన్ను నేకవిధముల నిర్బంధించుచుండెను. అన్యునికిచ్చి వివాహముసేయవలయునని యామెకోర్కె. జానకి ఆమెమాట వినకపోయిన నామె క్రోధానలమునకు భస్మపటలమై పోవును. మొదటినుండియు జానకికిఁ దల్లియనిన భయమెక్కువ. ఆమెమాట కెదురాడ వెఱచుచుండును. కావున జానకి చిరకాలము దీనివిషయమై యాలోచించెను. ఒక గంభీరమగు నాలోచన, భావము, ఆమె హృదయమునఁ దట్టెను. దానికన్న నాచరణీయము వేఱొండు లేదనినిశ్చయించుకొనెను.

జానకికి గుంటూరుసంబంధము స్థిరమయ్యెను. మాఘమాసమున ముహూర్తము పెట్టఁబడెను. ఇందులకు జానకిగూడ నంగీకరించెను. ఉభయపక్షములవారు వివాహప్రయత్నములలోనుండిరి. ముహూర్తము సమీపించెను. గుంటూరునుండి మగపెండ్లివారు ముహూర్తపుదినమునకుఁ దరలివచ్చిరి. ఇరుపక్షములలోను జాలమందిబంధువులువిచ్చేసిరి. మోహనరావుమాత్రము రాలేదు. శుభలేఖఅందక కాదు! అందఱికన్న ముందుగనే యాతనికి శుభలేఖవచ్చెను. దూరమునుండియేయతని హృదయవేదనదుర్భరముగుచున్నప్పుడు, విజయవాడకువచ్చిజానకియెదుట నిలువఁగలఁడా? జానకి కంఠసీమ నన్యుఁడుమంగళసూత్రమునుఁగట్టుటఁ గన్నులారఁజూడఁగలఁడా? జానకి పరునిపై దలఁబ్రాలుపోయుటఁజూచి సహింపఁగలఁడా? రాజమహేంద్రవరముననే, యామనోవ్యథ భరింపఁజాలకుండెను. ఇఁక జానకియెదుట భరింపఁగలఁడా? మేనయత్తపైఁబట్టరానికోపము వచ్చెను. కాని ఏమిసేయఁగలఁడు? జానకి తనహృదయపూర్వకముగా వివాహమున కంగీకరించినదా యనుసందేహ మతనిని సదా పీడించుచుండెను. జానకి తన్నట్లు మోసగించునా? ఏమో స్త్రీలను నమ్మరాదు. అని సందేహించుచుండెను. కాని నిజమగుసంగతి తెలియలేదు. ఈవివాహమున కామె సమ్మతింపదని యాతనికి గట్టినమ్మకము. కాని వివాహము స్థిరపడినది.

ఈసందేహములతో మోహనరావునకు మతిపోయెను. దీనివలన జదువునందుఁగూడ శ్రద్ధతగ్గెను. అతనికి మాటిమాటికి జానకి కౌఁగిలింత, "నీకుఁ దప్ప నాహృదయమున నన్యునకుఁ దావులే"దను మృదుమధురస్వరమున వెలువడిన యామెవాక్యము జ్ఞప్తికి వచ్చుచుండెను. అట్లు జ్ఞప్తి వచ్చినప్పుడెల్ల నాహృదయవేదన మఱింత దుర్భరమై పోవుచుండెను.

అట జానకి నిశ్చలయై యుండెను. విచారసూచన లేదు. సంతోషచిహ్నములును లేవు. ఏవిషయమునుగూర్చియుఁ దనయభిప్రాయము నిచ్చుటలేదు. ఇతరు లేమిచెప్పినను "ఊఁ" యని యూరకుండును. విస్తరించి యెవరితోడను మాటలాడుట మానెను. ఆమె హృదయముయొక్క లోఁతు నెవ్వరును గ్రహింపఁజాలకుండిరి. వివాహము యథావిధి జరిగిపోయెను. వరుఁడు మంగళసూత్రమును దనకంఠసీమఁ గట్టునప్పుడుమాత్ర మామె దుఃఖము నాఁపుకొనఁజాలకపోయెను. కన్నులనుండి కన్నీటిబిందువులు జలజలరాలెను.

౬

జానకిలేఖ - నౌకావిహారము

రాజమహేంద్రవరమున మోహనరావునకుఁ గొంచె మెచ్చుతక్కువగఁ బిచ్చియెత్తినట్లయ్యెను. అతనిహృదయము పలువిధములగు నాలోచనలకు భావములకుఁ దావయ్యెను. ఒకమూల "జానకి నన్నిట్లు మోసగించెనుగా!" యనుదుఃఖము; ఒకమూల మేనయత్తపైఁ గోపము; ఒకమూల జానకి కౌఁగిలింత జ్ఞప్తికివచ్చుట, ఆమె వాగ్దానములవలని ఆశ; ఒకమూల జీవితముపై విరక్తి; ఒకమూల పగ; ఒకమూల నసూయ; ఇన్నియు నేకమై యాతనికిఁ బిచ్చియెత్తించెను. చదువు తిన్నఁగ సాగుటలేదు. పరీక్ష లెట్లో గడచెను. వేసవిసెలవులు వచ్చెను. విజయవాడకు వెళ్లుదునా వలదా యని యాతఁ డాలోచింపఁదొడఁగెను. వెళ్లి జానకినెట్లు చూడఁగలఁడు? వెళ్లకుండిన నిట దిక్కెవరు? మేనయత్తయే తనచదువున కాధారమైయున్నది. పర్యవసానమేమియు నాలోచింపలేకపోయెను.

ఒకనాఁడు విజయవాడనుండి రెండుత్తరములు వచ్చెను. అందొకటి విప్పిచూచెను. అది తనమేనత్త వ్రాసినలేఖ. అందుఁదాను పెండ్లికిరాకపోవుటకుఁ గారణ మడుగుచు సెలవులిచ్చిన తక్షణమే బయలుదేరి రావలయునని వ్రాయఁబడియుండెను. రెండవయుత్తరము విప్పిచూచెను. విప్పగనే జానకి కోమలహస్తముతో వ్రాసిన యక్షరములు గాన్పించెను.

అందిట్లుండెను:

"మోహనా!

నావివాహవిషయమై నీకిదివఱలోఁ జెప్పుటగాని వ్రాయుటగాని లేదు. ఈసందర్భమున నీమనస్సెట్లుండునో నాకుఁ దెలియును. నీవుపొందినంత హృదయవేదన నేనును బొందితినిగాన నీబాధ నేను గ్రహింపఁ గల్గితిని.

కాని కొండొకకారణమున నాహృదయము రాయిఁజేసి కొంటిని. అమ్మసంగతి నీవెఱుంగుదువుగదా! ఆమె ప్రచండక్రోధానలమున కాఁగలేక యట్లొనర్చితిని.

అయినప్పటికిని నాహృదయమునమాత్రము మార్చ లేదు సుమా! నాభౌతికదేహమునుమాత్రమే యానూతనవరుని స్వాధీనము గావించితిని. అతఁడు దానికే మంగళసూత్రమును గట్టెను. హృదయము మాత్రము నీదె. దానికి మంగళసూత్రము నాఁడే నీవు కట్టినావు. అందుచే మనకిఁక నావిషయమున విచారము వలదు. ధీమంతుఁడవగు నీకు విస్తరించి చెప్ప నవసరము లేదు.

నీవు మఱల నెప్పటియట్లనే యుండుము. ముఖభావమునందేమి, చర్యలయందేమి, నీహృదయమును గనుపఱుపకుము. సెలవులిచ్చిన తోడనే రమ్ము. అమ్మ యిప్పటికిని నీకు మాతృసమానయగు మేనయత్త! తక్కిన విషయము లన్నింట నీకామె లోటుజరుగనీయదు. కనుక పయనించి వెంటనే రమ్ము.

ఇట్లు ప్రేయసి,
జానకి."

మోహనరావునకు సెలవులనిచ్చి వారమైనది. విజయవాడకు వెళ్లుటకు నిశ్చయించుకొనెను. రైలెక్కి విజయవాడస్టేషనులో దిగి బండిచేసికొని యింటికి బయలుదేరెను. అతనిహృదయ మెందుచేతనో కాని వడిగఁ గొట్టుకొనసాగెను. ఇప్పుడు తాను జూడఁబోవు జానకి మునుపటిజానకి కాదు! వివాహిత; పరకాంత. అట్టిజానకిని మోహనుఁడు చూడఁగలఁడా? ఎట్లైనను దప్పదు. హృదయమును గుదుటఁ బెట్టుకొనఁ బ్రయత్నించెను. కార్యము విఫలమయ్యెను. బండి చంద్రభవనమును సమీపించెను. సమీపించిన కొలఁది హృదయము మఱింతవేగముగఁ గొట్టుకొనసాగెను. చంద్రభవనముఖద్వారమున బండి నిలచెను. మోహనునకు శరీరము కంపింప మొదలిడెను. బండినుండి దిగవలసివచ్చెను. దిగుటయెట్లు? దిగిన జానకి కంటఁబడు నేమో. అయినను, దిగుటతప్పదు. ఎట్టకేలకు బండినుండిదిగెను. వీధిగుమ్మము తెఱువఁబడియుండెను. అట నెవరును లేరు. అతఁడు లోపల ప్రవేశించెను. అక్కడ నెవ్వరును గాన్పింపలేదు. బండివానికి అద్దె నిచ్చి పంపివేసి, సావడిలో నిటునటు జూచుచుండెను. ఎవరు ముందుఁ గంటఁబడుదురో -జానకియో - మేనత్తయో? ఎవరు గాన్పించిన నెట్లు ప్రవర్తింపవలయునో? అతని కేమియుఁ దోఁచుటలేదు.

ఇంతలో దొడ్డిలోనుండి యొకవ్యక్తి తనవైపునకు శరవేగమున వచ్చుచుండెను. మోహనునకుఁ గండ్లు చీకట్లు గ్రమ్మెను. నిస్తబ్ధుఁడై పోయెను. ఆవ్యక్తి పరుగునవచ్చి, యాతనిఁ గౌఁగిలించుకొనియెను. ఆవ్యక్తి మనజానకియే. ఇది మూఁడవకౌఁగిలింత! జానకీమోహను లిప్పుడీ లోకమున లేరు.

కొంతసేపటికి వారికి మెలఁకువవచ్చెను. మోహనరావు, తన్నుఁ గౌఁగిలించుకొనినవ్యక్తి జానకియని తెలిసికొనెను. ఇంతవఱకు నెవరి కంటఁబడుట కాతఁడు భయమొందుచుండెనో, ఆమెయేయామె! ఆమె పరకాంతయని తనకుఁ దెలిసియున్నను కౌఁగిలి విడిపించుకొనలేక పోయెను. వెంటనే వారిరువురును గన్నీటిసెలలఁ బ్రవహింపఁజేసిరి.

పొరిగింటికేగియుండిన కామేశ్వరమ్మగారు వచ్చి మోహనరావును కుశలప్రశ్నల నడిగిరి. వానికన్నిటికిని మోహనరావు సరియైన సమాధానము నిచ్చెను. తనహృదయభావము నామెకుఁ దెలియనీయక, యెప్పటియట్లనే మెలఁగుచుండెను.

ఒకనాఁటిసాయంకాలము, కామేశ్వరమ్మగారు పొరుగింటికి, జనిరి. జానకీమోహనులిద్దఱు నలవాటుప్రకారము విహారమేగిరి. నేఁడు నౌకావిహారము సేయఁదలఁచిరి. వారికొక చిన్ననావ గలదు. అందులో వారిరువురుమాత్రమే యెక్కి, వారే నౌకను నడపించుకొని నదీగర్భమునకు బయలుదేరిరి.

కృష్ణవేణీస్రవంతి లేఁతకెరటములతోఁ బ్రశాంతమై యుండెను. మలయమారుతము మెల్లన వీచుచుండెను. జానకీమోహను లధిష్ఠించిన నౌక, రాజహంసవలె నొయ్యారముగఁ బోవుచుండెను. ఆకాశమున మేఘము లక్కడక్కడ నుండి చూపరుల కానందమొదవించుచుండెను. పశ్చిమాద్రినున్న లోకబాంధవుఁడు తన సంధ్యారాగము లంబరవీథి వెదఁజల్లి యామేఘమాలికలకు వింతశోభఁ గల్గించుచుండెను. ఆసంధ్యారాగపుకెండలోఁ బ్రకృతియంతయు నవజీవనము గాంచినట్లుండెను. నావ నడచుచుండెను.

భానుఁడు పడమటఁ గ్రుంగిపోయెను. అరుణకాంతు లస్తమించెను. నలుఁగడలఁ జీకట్లలముకొనుచుండెను. ప్రకృతి నిశ్శబ్దముగ నుండెను. నావ నడచుచునే యుండెను.

జానకి తానువేయుచున్న తెడ్డు నాఁపివైచి తనరొండిలో దాఁచి యుంచిన రివాల్వరును పైకిఁదీసెను. మోహనుఁ డది చూచి తాను గూడ తెడ్డునాఁపివైచెను. జానకి మందహాసవిలసితవదనముతో మోహనుని ప్రక్కఁ జేరి కూర్చుండెను. నావ నడుపుట నాఁపివైచిరి. అది నదీగర్భమునఁ దనదారిఁ బోవుచుండెను.

"మోహనా!" యని జానకి యప్రయత్నముగ ననెను.

"జానకీ!" యను ప్రత్యుత్తరముగూడ నప్రయత్నముగనే వచ్చినది. వారిరువురి మృదుమధురస్వర మాకృష్ణవేణీతరంగమాలికలపైఁ దేలియాడెను.

"ఇదిగో రివాల్వరు, అందికొనుము; ముందునన్ను-తరువాతనీవు."

"కాదు, కాదు, ముందు నేనే, తరువాత నీవు.

"హృదయేశ్వరుఁడవగు నీకన్న ముందు నేఁబోయినఁగాని నాకు ముక్తిలేదు".

"జానకీ! నాచేతు లాడకున్నవి. ఆ—అయ్యో!"



"అమ్మా, జానకీ! నాయనా, మోహనా! నేను పోయివచ్చెదను." —పు. 197

"మన పరస్పరప్రేమకు అత్త యవరోధము గల్పించునేమో యని భయమగుచున్నది" —పు. 198

" ఇదిగో రివాల్వరు, అందికొనుము, ముందు నన్ను-తరువాత నీవు "—పు. 200

జానకి క్షణమాలోచించెను. చివర కొకయుపాయము దోచెను. నౌకయింకను నదీగర్భముననే యున్నది. క్రింద నఖాతముగలోతు. జానకి తనరివాల్వరుతో నావయొక్క గర్భమున గురిచూచి "తల్లీ! మమ్ము నీగర్భమున ధరించినందులకు నిన్నుఁ గూడ మాతోఁ దీసికొనిపోవలసి వచ్చినది. ద్రోహమునకు క్షమింపుము" అని ప్రేల్చెను. వెంటనే రెండుమూఁడుకన్నములుపడెను.

నౌకలోనికి నీరు గ్రమ్మచుండెను. జానకీమోహనులు గంభీర హృదయులై కూర్చుండిరి. ఒకరినొకరు కౌఁగిలించుకొనిరి; ఒకరినొకరు ముద్దుగొనిరి; కండ్లనుండి కన్నీరుఁగార్చిరి. అదియే కడసారికౌఁగిలింత! అదియేకడసారిముద్దు! అదియే కడసారికన్నీరు! ఆహా! ఆకౌఁగిలి. ఆ ముద్దు; ఆకన్నీరు: ఎంతపవిత్రములైనవో కదా! ఆక్షణకాలముననే వారనుపమానందమునుగూడ ననుభవించిరి.

కౌఁగిలి వీడనేలేదు. శిరములు వంచిరి. పరమేశధ్యానమునఁబను లైరి. నౌకనిండుగ నీరెక్కినది. ఒక్కపెట్టున నానౌక తనతో నాజానకీమోహనుల నాకృష్ణవేణీగర్భమునకుఁ దోడ్కొనిపోయెను. పైన నేమియునెఱుఁగనట్లు కృష్ణవేణి మెల్లగఁ బ్రవహించుచుండెను.

భీష్మప్రశంస

మండలేముల వేంకటశాస్త్రిగారు, బి. ఏ. ఎల్. టి.

కారణ జన్ముండై గంగాగారమణీమణికిఁ గన్నకడుపై, ధీరో
దారుండై, జితశాత్రవ, వీరుండై మెఱసినాఁడుభీష్ముండిలలోన్.

సీ. భుజవిక్రమక్రమస్ఫురణచే నెవ్వాఁడు
భార్గవరాముగర్వం బడంచె
వేదాంతశాస్త్రార్థ విజ్ఞానమున నెవ్వఁ
డయ్యుధిష్ఠిరు సంశయములఁబాపె,
సాత్త్వికప్రజ్ఞాప్రశస్తిఁ బాండవులకుఁ
బలికెను నిజవధోపాయ మెవ్వ,
డనవస్కరాజ యోగారూఢి హృత్పద్మ
మున నిల్పెఁ బరమాత్ము ననఘుఁ డెవ్వఁ

తే.గీ. డుత్తరాయణ పుణ్యకాలోదయమ్ము
దనకుఁ బ్రాణములను మేనఁ దాల్చె నెవ్వఁ
డతఁడు పొగడొందు; శంతనుసుతుఁడు ఘనుఁడు
పుణ్యచరితుండు నవతార పూరుషుండు.

క. జితమన్మథవిగ్రహుఁ డరు,
చితమతి వేదాంతశాస్త్ర సిద్ధాంతములన్
మతియుతుఁడు బ్రహ్మచర్య,
వ్రతదీక్షాపరుఁడు సుజన వంద్యుఁడు ఘనుఁడున్.

ఉ. సాయకతల్పమందు దివిజస్తుతలీలఁ దనర్చి మౌనియై
గాయమువాయఁబూని యుదకమ్మును గ్రోలుచు గాలిఁ దీల్చుచున్
పాయని ప్రేమ, ధర్మజా నహా స్తమనోవ్యథఁ జేసి చేరఁ గాం
గేయుఁడు సత్వరమ్ము మదిఁ గీలితవిష్ణుపదాబ్జభక్తుఁడై.

క. "నా యిచ్చవచ్చినప్పుడు, వాయుదు నీతనువు" ననుచుఁ బల్కిన ధీరుం
డేయుగమునఁగలఁడే గాం, గేయుండొక్కరుఁడు దక్కఁగీర్తింపంగన్

సీ. పుణ్యుఁడై భక్తాగ్రగణ్యుఁడై నారదు
మించినాఁడు ప్రశస్తిఁ గాంచినాఁడు,
దాంతుఁడై, విమలసుస్వాంతుఁడై పరమవే
దాంతుఁడై మునివృత్తిఁ దాల్చినాఁడు,
మాన్యుఁడై శౌరిసమాన్యుఁడై సహజసా,
జన్యమ్ముఁ బలుమారు చాటినాఁడు,
జ్ఞానియై బ్రహ్మవిజ్ఞానియై, సనకాది
జ్ఞానమూర్తులఁ బోలఁ జాలినాఁడు

తే. గీ. భీష్ముఁ డని సురలెల్లరు వినుతిసేయ
బిరుదుమగఁడన ధరణిలోఁ బరగినాఁడు
జనకు మెప్పింప సద్బ్రహ్మచర్యమూని
వరముఁ గొనినాఁడు స్వచ్ఛందమరణమునకు.

గీ. బ్రహ్మచర్యాశ్రమంబున వఱలుచుండి
క్షత్రియుండయ్యుఁ; సద్విజాశ్రయములైన
నాల్గుపురుషార్థములఁ బొందఁగల్గినాఁడు
తరమె యాతనిమాహాత్మ్యగరిమఁ బొగడ.

చ. జనకునియట్ల బాహుబలసంపదయున్, మఱి తల్లిపోలెఁ బా
వనసుచరిత్రముల్, గురునిభంగి మునీశ్వరవృత్తి నొంది, నె
మ్మనమున భక్తిమార్గముఁ గ్రమంబునఁ బూనుచుఁ గర్మయోగియై
జనకుని మించి యొప్పెనట జన్మము లిట్టివి యొందుఁగల్గెనే?

గీ. బాహుబలమును, సలలితవ్రతము బుద్ధి
యై భవమ్మును నిష్కామభక్తియుక్తి
జ్ఞానవైరాగ్యములు మించు శాంతనవుఁడు
భారతీయజనాళి హృత్పద్మముల వ
సించి దేశాభ్యుదయముఁ గల్పించుఁగాత!